www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025
5
చిత్తూరు

నేడు రన్ ఫర్ టూరిజం 2 కె రన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 27వ తేదీ శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో జిల్లాలో శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు పట్టణం గాంధీ విగ్రహం నుండి మెసానికల్ గ్రౌండ్స్ వరకు రన్ ఫర్ టూరిజం 2కె రన్ కార్యక్రమం ఉదయం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందన్నారు. అలాగే ఈకార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి మున్సిపల్, పోలీస్, క్రీడా, విద్యా శాఖ అధికారులకు బాధ్యతలు కేటాయించడం జరిగిందన్నారు.

ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్ల జీతాలు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్పందించి కనీస వేతనాలు పెంచుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న నిర్వహించిన కనీస వేతనాల పెంపుకు సంబంధించి కమిటీ సభ్యులు చేసిన సిఫారసులను పరిశీలించి, ధరల పెరుగుదల వ్యత్యాసాన్ని అనుసరించి వేతనాల పెంచడం జరిగిందన్నారు. ఈ కనీస వేతనాల పెంపు ఏప్రిల్ 2025 నుండి వర్తిస్తుందన్నారు. గ్రామీణ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీ కింద విభజించి వేతనాలను నిర్ణయించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.565, సెమీ స్కిల్డ్ కు రూ.593, స్కిల్డ్‌కు రూ.624 లుగా, మున్సిపాలిటీ పరిధిలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.652, సెమీ స్కిల్డ్‌కు రూ.685, స్కిల్డ్‌కు రూ.719లుగా, కార్పొరేషన్ పరిధిలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.712, సెమీ స్కిల్డ్‌కు రూ.748, స్కిల్డ్‌కు రూ.786 లుగా వేతనాలు నిర్ణయించడం జరిగిందన్నారు.

నేడు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని 27వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు చిత్తూరులోని జెడ్‌పి మీటింగ్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సహాయ సంచాలయకులు బి.వినోద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బధిరులు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ, బ్యాంకు తదితర శాఖలకు చెందిన ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడి సౌకర్యం ఉందనే విషయాన్ని తమ అధికారులకు తెలియజేసి ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఏడీ పేర్కొన్నారు.

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన

జీఎస్టీ ప్రయోజనాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, జిల్లా అధికారులతో, మున్సిపల్ కమిషనర్లతో, ఎమ్మార్వో, ఎంపీడీవోలతో, జీఎస్టీ అమలపై ప్రజల అవగాహన కార్యక్రమాలు ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిఎస్టి తగ్గింపు వల్ల ఏవిధంగా లబ్ది కలుగుతుందనే దానిపై ప్రజలకు తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల కార్యక్రమాన్ని అక్టోబరు 19వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈనెల 26 నుండి 29 వరకూ ఇంటింటికీ వెళ్లి జిఎస్టి తగ్గింపు వల్ల కలిగే లబ్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 6 వరకూ వ్యవసాయం, ఇతర వృత్తుల వారికి, అక్టోబరు 7నుండి 13వ తేదీ వరకూ మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాంకేతికతకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అక్టోబర్‌లో సిఐటియు జిల్లా మహాసభలు

కరపత్రాలు విడుదల చేసిన నాయకులు

మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- కుప్పం: సిఐటియు జిల్లా మహాసభలు ఈ నెలలో జరగాల్సి ఉండగా అనివార్య కారణాలు వల్ల వాయిదా వేస్తూ అక్టోబర్ 27, 28 తేదీలలో చిత్తూరులో ఘనంగా జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని శుక్రవారం కుప్పంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ నిరంతరం కార్మికుల పక్షపాతిగా ఉంటూ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ, సంఘమిత్ర, ఆశ, మధ్యాహ్నం భోజనం, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులతో పాటు, అసంఘటిత రంగాలైన ఆటో, హమాలీ, బిల్డింగ్ దళితం పోస్టల్, ఎల్ఐసి, మున్సిపల్, గ్రామపంచాయతీ, రకరకాల కార్మిక ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం సిఐటియు అన్నారు. ఈ మహాసభల జయప్రదానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు భారీ ర్యాలీ, ప్రదర్శన జరుగుతుందని వీటిలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో భవిష్యత్తులో కార్మికుల సమస్యల పోరాటాలపై పలు రకాల తీర్మానాలు చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యపద్ధతిలో నూతన కమిటీని ఎన్నుకొని భవిష్యత్తు పోరాటాలకు పదును పెడతామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ప్రమీల, లలిత, సరళ, కస్తూరి పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు పనులకు మార్కింగ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరపాలక కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల ప్రకారం హై రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తెలిపారు. రోడ్డు పనుల్లో భాగంగా కట్టమంచి రైల్వే బ్రిడ్జి నుంచి హై రోడ్డు కృష్ణుడి గుడి వరకు 750 మీటర్ల పొడవులో 100 అడుగుల విస్తీర్ణంతో రోడ్డు నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌లో ఆమోదం లభించిందని, ఈ రోడ్డు డెవలప్‌మెంట్ (ఆర్‌డీ) ప్లాన్ అధికారికంగా ఆమోదం పొందిందని, ఆమోదించిన ప్రణాళిక ప్రకారం శుక్రవారం మార్కింగ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

డిజిటల్ సర్వేతో నాణ్యమైన వైద్యం

కలెక్టర్ సుమిత్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కొత్తగా టాటా కన్సల్టెన్సీ సంస్థ ద్వారా డిజిటల్ నర్వ్ సెంటర్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు, నగరి, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో త్వరలో ప్రవేశ పెట్టబోతున్న డిజిటల్ నర్వ్ సెంటర్లలో చిత్తూరు జిల్లాలోని ప్రజలకు అందరికీ నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా దీర్ఘకాలిక వ్యాధులకు, ఇతర వ్యాధులకు రక్తపోటు, మధుమేహం, కేన్సర్లు, గుండెవ్యాధులు, థైరాయిడ్, మూత్రపిండాలు, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, దీర్ఘకాలిక వ్యాధులకు శస్త్రచికిత్సలు, ఫాలోఅప్ చికిత్స, టెలి కన్సల్టేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కాల్ చేసిన వెంటనే చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. గర్భవతి సేవలు, బాలింత సేవలు, చంటి బిడ్డల సేవలు కౌమార దశ బాలికల సేవలు, క్షయ వ్యాధి, కుష్టు వ్యాధి, రక్తహీనత నివారణ పై అవగాహన, చికిత్స ప్రత్యేక నిపుణుల చేత నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం త్వరలో ఒక ప్రత్యేక ప్రణాళిక ద్వారా సిబ్బందికి వర్క్‌షాప్ నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, ప్రోగ్రాం అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిడిపిఓతో యూనియన్ నాయకులు చర్చలు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ప్రాజెక్టులో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఓతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ కుప్పం ప్రాజెక్టులో ఉన్న సమస్యలపై ప్రాజెక్టు స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కొంతమంది వలన కొన్ని సమస్యలు వస్తున్నాయని వాటిని స్థానికంగానే పరిష్కరించుకోవడానికి సహకారం అందిస్తామని తెలిపారు. నాయకులు ప్రమీల, సరళ, కస్తూరి పాల్గొన్నారు.

జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తాం..

సిడిపిఓ హామీ

ప్రాజెక్టుస్థాయిలో పని మెరుగు పడటానికి, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమన్వయంతో ముందుకెళదామని సిడిపిఓ చంద్రకళ తెలిపారు. వర్కర్లకు హెల్పర్లకు మినీ వాళ్ళకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

సీడీపీవోతో చర్చలు జరుపుతున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

ఆదాయ పన్ను చెల్లింపుల్లో అజాగ్రత్త వద్దు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రమణారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆదాయ పన్ను చెల్లింపుల విషయంలో అజాగ్రత్తగా ఉండకుండా జాగ్రత్తగా చెల్లించాలని జిల్లా ఆదాయ పన్నుల శాఖ జిల్లా అధికారి కెవి.రమణారావు అన్నారు. శుక్రవారం స్థానిక రాజా మహల్ హోటల్‌లో ఆదాయపన్నుల చెల్లింపుదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్స్ పేయర్స్ ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితంగా తమ ఆదాయానికి సంబంధించిన పన్నులను చెల్లించాలని సూచించారు. ఆదాయపు వివరాలను ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఆదాయపన్నుల శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్న ఆదాయ పన్నులు చెల్లింపు అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్, కార్యాలయ సూపర్వైజర్ అశోక్, భరత్, ఆడిటర్లు రమేష్ బాబు, కుమరేంద్ర చౌదరి, సిబ్బంది సుమిత్ కుమార్, గుణశేఖర్ పాల్గొన్నారు.

సిసిఐలో తనిఖీలు నిర్వహించాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వారానికి ఒకసారి సిసిఐలలో ఉన్న పిల్లల ఆరోగ్యంపై తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ సంబంధించిన వివిధ అంశాలపై కమిటీ మెంబర్లతో జెసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 9 బాల సంరక్షణ సంస్థలు ఉన్నాయని, వీటిని కమిటీ మెంబర్లు కచ్చితంగా రక్షణ కేంద్రాలను సందర్శించాలని, ప్రతి కమిటీలో ఒక మహిళ, ఒక వైద్యులు మొత్తం ముగ్గురు సభ్యులు ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలు ఆరోగ్య సమస్యలను డాక్టర్ల దృష్టికి తీసుకొని వెళ్ళి అవసరమైన చికిత్స అందించాలన్నారు. సంరక్షణ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, భద్రత, ఆహారం, తదితరాలను పర్యవేక్షించాలన్నారు. పిల్లల ఎదుగుదలను మనోవైద్య నిపుణులు వైద్యశాఖ సమన్వయంతో పరీక్షించాలన్నారు. బాల సంరక్షణ కేంద్రాలలో సందర్శించి సమస్యలను గుర్తించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమర్పించిన నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందని అన్నారు. పిల్లలకు అవసరమైన నైపుణ్య అభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ అందించడంపై దృష్టిసారించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, శాఖల సహకారంతో జిల్లాలో నమోదు కానీ బాలల సంరక్షణ సంస్థలను గుర్తించాలని, నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ నిర్మల, సంరక్షణ అధికారిని రాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి విద్యాధరి

విజయవాడ దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం తరపున విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ వారికి పవిత్ర సారెను పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ సమర్పించారు. ఏడాదిలో ఆషాడమాసం, దసరా నవరాత్రులు ఉత్సవాల సందర్భంగా రెండు సార్లు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం నుండి పవిత్ర సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం పవిత్రమైన దసరా నవరాత్రుల సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ వారికి దసరా నవరాత్రుల సారెను తీసుకొచ్చారు. ముందుగా కనక దుర్గమ్మ ఆలయం వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యేకి, ఈవో పెంచల కిషోర్‌కి ఆలయ కార్యనిర్వహణాధికారి వికే.సీనా నాయక్ మంగళ వాయిద్యాల నడుమ ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మహామండపం ఆరోవ అంతస్తులో అమ్మవారి ఉత్సవమూర్తి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీ కనక దుర్గమ్మ వారికి సారె సమర్పించి అమ్మవారిని దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఈవో శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసారు. కాణిపాకం ఆలయ చైర్మన్ మణినాయుడు, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, యాదమరి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ పాల్గొన్నారు.

హింస లేని కుటుంబాలే లక్ష్యం

మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్పించాలి: డీఆర్‌డీఏ పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): హింస లేని కుటుంబాలే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది కృషి చేయాలని చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో క్షేత్రస్థాయిలోని డీఆర్‌డీఏ సిబ్బందికి, మండల జిల్లా సమాఖ్య ప్రతినిధులకు జెండర్ కార్యక్రమాలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మహిళల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, అయితే సంఘాల్లో ఉన్న మహిళలకు ఆర్థిక వనరులు అందుకుంటున్న కుటుంబంలో హింస కారణంగా ఈ వనరులను సక్రమంగా సద్వినియోగం కాకపోవడంతో ఆశించిన స్థాయిలో పేదరిక నిర్మూలనా లక్ష్యం నెరవేయడం లేదన్నారు. దీన్ని అధికమించాలంటే కుటుంబాల్లో హింసను అరికట్టాలని, సామాజిక సమస్యలన్నిటిని గుర్తించి వాటిని పరిష్కరించడానికి సిబ్బంది సామాజిక అజెండాను సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. మహిళల్లో నిర్ణయాత్మక శక్తిని పెంచడంతోపాటు వారి భాగస్వామ్యాన్ని పెంచి వివక్షకు వ్యతిరేకంగా వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రధానంగా జిల్లా మండల సమాఖ్యలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది కుటుంబ సమస్యలను పరిష్కరించి వారి ఆలోచనశక్తిని నైపుణ్యాలను పెంపొందించి వారి ఆర్థిక స్వావలంబనకు చొరవ చూపాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి వారు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు సహాయసహకారాలు అందించాలని అప్పుడే సమాజం అని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళా చట్టాలు, హక్కుల గురించి గ్రామస్థాయిలో చర్చ జరగాలన్నారు. వైద్యశాఖ అధికారి వాణి మహిళ ఆరోగ్య సంరక్షణ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వయోజన విద్య డిడి మహమ్మద్ ఆజాద్, డిపిఎం మంజుల, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, హేమ, సీసీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

ప్రజల భద్రత గాలికి..

- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- రోజూ ఇదే తంతు..
- భారీ టిప్పర్లతో డస్ట్ తరలింపు
- కనీస నియమాలు పాటించని వైనం

ప్రజాశక్తి- వెదురుకుప్పం

భారీ టిప్పర్లలో తరలిస్తున్న కంకర దుమ్ము వలన స్థానికులు నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నారు. ఈ టిప్పర్లు లోడ్ వెళ్లిందంటే చుట్టుపక్కల వారితోపాటు వాహనదారులకు అవస్థలు తప్పవు. కంకర డస్ట్‌ను తరలిస్తున్నప్పుడ దానిపై నీళ్లు చల్లి పట్ట కప్పి ప్రజలకు ఇబ్బంది లేకుండా రవాణా చేయాలని నియమాలు ఉన్నా వాటిని వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోజూ యథేచ్ఛగా రోడ్లపై తరలిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూనే ఉన్నారు. క్వారీల యజమానుల వలన ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం ప్రజల భద్రతను గాలికి వదిలి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురు కుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట సమీపంలో రెండు కంకరు గచ్చు ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇక్కడ చిన్న సైజు నుంచి పెద్ద సైజు కంకరు, డస్ట్ (ముగ్గు పిండి) తయారు చేసి ఇక్కడ నుంచి పక్క రాష్ట్రమైన తమిళనాడుకి పచ్చికాపల్లం, కార్వేటినగరం మండలం మీదుగా పల్లిపట్టు నుంచి రోజుకు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు, లారీల సహాయంతో తరలిస్తుంటారు. ఈ సమయంలో దుమ్ము గాలికి ఎగురకుండా నీళ్లు చల్లడం, పట్ట కప్పడం వంటి నియమాలు కూడా పాటించకుండా నిర్లక్ష్యంగా వెళుతుంటారు. దీంతో ప్రజలు, వాహనదారులు, పక్కనున్న దుకాణాల యజమానుల కళ్ళలో దుమ్ము పడుతోంది. పలువురు దీని వలన కళ్ళు మంటలతో డాక్టర్లను సంప్రదించి వైద్యం చేసుకున్న ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఇసుక కంటే ఈ డస్ట్‌కు తమిళనాడులో ఎక్కువ డిమాండ్ ఉంది. ఇసుక ధర కంటే దీని ధర తక్కువగా ఉండటంతో పలు నిర్మాణాలు, సిమెంట్ ఇటుకల తయారీలో వీటిని ఎక్కువ ఉపయోగిస్తుంటారు. దీంతో క్వారీల యజమానులు ఇక్కడి నుంచి తమిళనాడుకి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి వ్యాపారం వలన చుట్టుపక్కల గ్రామస్తులు నిత్యం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి కంకర దుమ్ము తరలించేటప్పు నీళ్ల చల్లడం, పట్ట కప్పి గాలికి దుమ్ము పైకి ఎగురకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్‌లో కంకర దుమ్ము తరలిస్తున్న దృశ్యం

గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా..

- వినియోగదారులకు అందని సిలిండర్లు
- బ్లాక్‌లో రూ.1200లకు విక్రయం
- చేతివాటం ప్రదర్శిస్తున్న డీలర్ బాయ్స్

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

గృహ అవసరాల కోసం వినియోగించాల్సిన పేద, మధ్య తరగతి ప్రజలకు అందించే సబ్సిడీ వంట గ్యాస్‌ను కొంతమంది వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్‌లో కొనుగోలు చేసి తమ వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ నిర్భయంగా ఈ సిలిండర్లను వాడుతున్నా, పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్న పరిస్థితి నెలకొంది. కళ్లముందే ఈ అక్రమ గ్యాస్ దందా జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తూ మామూళ్ల మత్తులో మునిగిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ ధరతో పోల్చితే డొమెస్టిక్ సిలిండర్లు తక్కువ ధరకు అందుబాటులో ఉండటంతో వ్యాపారులు వాటిపైనే ఆసక్తి చూపుతున్నారు. డెలివరీ చేసే వారు ప్రధాన సరఫరాదారులుగా మారి ఒక్కో సిలిండర్‌కు రూ.200ల నుంచి రూ.400లు వరకు అదనంగా తీసుకుని విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ వినియోగాన్ని నిరోధించాల్సిన అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. మరింతగా, ఈ అక్రమ దందాను నిర్వహించే గ్యాస్ ఏజెన్సీలు తమ వాహనాలపై ఏజెన్సీ పేర్లేమీ లేకుండా తరలింపు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేతివాటం ప్రదర్శిస్తున్న డీలర్ బాయ్స్

నిత్యాఅవసరాలకు వాడుకునే వంట గ్యాస్ కమర్షియల్‌గా వాడుతున్నారు. దీంతో గృహ వినియోగదారులు గ్యాస్ సిలిండర్లు సకాలం దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసి వారం రోజులు కావాస్తున్నా వినియోగదారులకు అందడం లేదు. దీంతో బ్లాక్ మార్కెట్‌లో రూ.1200లు ఇచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లేనిదే ఏ పనులు జరగవు, అలాంటిది గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే ఇంటికి రావడానికి వారం, పది రోజులు పడుతోంది. ఒక ఫాస్టుఫుడ్ సెంటర్, రెస్టారెంట్స్, హోటల్స్, టీ షాప్స్‌కి అయితే అడిగిన ఒక గంటలో గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే గ్యాస్ డెలివరీ బాయ్స్ చేతివాటం ఎంత వరకు అర్థమవుతోంది. ఇదంతా గ్యాస్ ఏజెన్సీస్‌లకు తెలిసి నడుస్తుందా లేక గ్యాస్ డెలివరీ బాయ్స్ చేస్తున్నారా అన్నది ప్రశ్నార్థకం. దీనికి సంబంధించిన అధికారులు మాత్రం నిద్రమత్తులో ఉండి చోద్యం చూస్తున్నారు.

అదనంగా రూ.50లు వసూళ్లు

ఇదిలా ఉంటే గ్యాస్ సిలిండర్ ఇంటికి వద్దకు డెలివరీ చేస్తే బిల్ మీద ఉన్న దాని కంటే రూ. 50లు నుంచి అధిక మొత్తంలో అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక వేళ ఇవ్వకుంటే గ్యాస్ సిలిండర్ లేట్‌గా డెలివరీ చేయడం, లేదంటే మేం వచ్చాం మీ ఇంటికి డోర్ లాక్ ఉందని రోజుల గడుతూ ఆలస్యంగా డెలవరీ చేస్తున్నారు. ఒకవేళ ఫోన్ చేసి ఇంకా గ్యాస్ డెలివరీ రాలేదని సమాధానం చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలా చేయడం వలన సామాన్య ప్రజలకు సరైన టైంలో గ్యాస్ సిలిండర్ అందకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు.

బుక్ చేసి వారం రోజులైనా అందని సిలిండర్

నిత్యావసరాల వినియోగదారులు ఆన్లైన్లో హెచ్‌పీ గ్యాస్ బుక్ చేస్తే వారం రోజులైనా వినియోగదారులకు అందడం లేదు. సిలిండర్ కోసం డీలర్ల చుట్టూ తిరుగుతూ ఉంటే కూడా సిలిండర్ దొరకపోవడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా డోర్ డెలివరీ చేయాల్సిన హెచ్‌పి గ్యాస్ డీలర్లు ఏదో ఒక్కచోట నిలబడి అక్కడి నుండి అందరికీ గ్యాస్ సిలిండర్లను ఇస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి నల్ల బజార్లో, తప్పుదారిలో సిలిండర్లు అమ్మడాన్ని కట్టడి చేసి వినియోగదారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ ఛైర్మన్



ఎమ్మెల్యే థామస్ సన్మానిస్తున్న ఆలయ ఛైర్మన్

ప్రజాశక్తి- కార్వేటినగరం: జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్‌ను విజయవాడలో కార్వేటినగరం శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి ఆలయ అధ్యక్షులు రామిశెట్టి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి గురించి చర్చించడం జరిగిందన్నారు. ఆర్‌కెఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనమైన లక్ష్మీమహల్ పునరుద్ధరణ తీసుకోవల్సిన చర్యలు తీసుకుంటామని, కాపులకు సంబంధించిన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్వేటినగరంను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

నాలుగు వైపులా స్వర్ణ కుప్పం ఆర్చీలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీకి నాలుగు వైపులా స్వర్ణ కుప్పం స్వాగత ఆర్చిలను ఏర్పాటు చేయనున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం ఏరియా ఆసుపత్రి వద్ద స్వర్ణకుప్పం ఆర్చి ఏర్పాటుకు శుక్రవారం కడా పీడీ, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రధానంగా కుప్పం మున్సిపాలిటీని అన్నివిధాలుగా ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం మున్సిపాలిటీకి నాలుగు వైపులా ప్రజలకు స్వాగతం పలుకుతూ స్వర్ణ కుప్పం ఆర్చిలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద సుమారు రూ.58 లక్షలతో స్వాగత ఆర్చిను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, సురేష్, రాష్ట్రనేత గోపినాథ్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివ, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కో క్లస్టర్ తిరుమగల్ పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో డ్రైనేజీ పనులు

డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం మేజర్ గ్రామ పంచాయతీలోని తిమ్మసముద్రం కాలనీలో రూ.20లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కూటమి నేతలు శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కాలనీలో ఇటీవల కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరుచేరడంతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన దీంతో వెంటనే అండర్ డ్రైనేజ్ పనులకు నిధులు కేటాయింపజేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలన్నిటిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. టిడిపి మండల అధ్యక్ష మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, విజయ్ రెడ్డి, పద్మమ్మ, అలివేలు శ్రీనివాసులు, బాలరాజు, మురళి, సుబ్బన్న, పద్మమ్మ, ఆంజనేయప్ప, సురేష్ పాల్గొన్నారు.

'రేబిస్' నివారణపై అవగాహన కల్పించాలి

పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో వరల్డ్ రేబీస్‌డేని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, రేబీస్ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. రేబీస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువులు ద్వారా మనుషులకు వ్యాప్తి చెందే ప్రమాదకరమైన వ్యాధి అని, ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుండా ప్రాణాంతకమవుతుందని, అయితే, రేబీస్‌ను 100 శాతం నివారించవచ్చు అన్నారు. రేబీస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ వ్యాక్సిన్ వేయించాలని, నిరాశ్రయ కుక్కల నుండి జాగ్రత్త వహించాలని, కుక్క కరిచినప్పుడు తక్షణమే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి, దగ్గరలోని వైద్యశాల, వెటర్నరీ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలలో అవగాహన పెంచడం ద్వారా 'రేబీస్ ఫ్రీ సొసైటీ' సాధ్యమవుతుందన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిఎం.రాజు

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని శుక్రవారం జరిగిని మహిళా సమాఖ్య సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జిఎం.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు సంబంధం ఫార్మా మిత్రాలతో సమావేశం ఏర్పాటు చేసి ఎఫ్‌పిఒ గ్రూప్‌లను గ్రామానికి ఒకటి ఏర్పాటు చేశామన్నారు. అలాగే ముందే వున్న గ్రూప్‌లను సక్రమంగా ముందుకు తీసుకెళ్లి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మరింత కృషి చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ బాలాజీ, ఏపిఎం రిటా తదితరులు పాల్గొన్నారు.

వింజం గ్రామంలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీలో డెంగీ కేసులు నమోదు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. శుక్రవారం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ హెల్త్‌క్యాంపు సందర్శించి జ్వరంతో బాధపడుతున్న ప్రజలు ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీలో పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. సెక్రెటరీ శ్రీనాథ్, సర్పంచ్ రామక్క గోవిందయ్య, టిడిపి యువ నాయకుడు సతీష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ డివిజన్‌గా చేద్దాం..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరు మంచి ఆరోగ్యంగా ఉంటామని 32వ డివిజన్ టిడిపి అధ్యక్షురాలు హేమావతి పేర్కొన్నారు. స్వచ్ఛ తాహీ సేవ 2025లో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్ స్వచ్ఛత కార్యక్రమాన్ని, స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. హేమావతి మాట్లాడుతూ 32వ డివిజన్ పరిధిలో పరిశుభ్రత, పచ్చదనం పెంచడానికి ప్రతినెలా మూడవ శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, సచివాలయ సిబ్బంది దేవేంద్ర, నాయకులు మురళి, శ్రీనివాసులు, రమాదేవి, వీణ, యమునా పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎంపీ దగ్గుమళ్ళ

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని వివి పురం గ్రామపంచాయతీ ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ ఆలయంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గంగమ్మ అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఎంపికి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఆయనతోపాటు చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్ పాల్గొన్నారు. దర్శనానంతరం వీరికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సిద్దయ్యశెట్టి, హిమాచలపతి రెడ్డి, జలంధర్ నాయుడు, జయచంద్ర నాయుడు, హేమాద్రి యాదవ్, వెంకటరమణ, మునిరెడ్డి పాల్గొన్నారు.

ఈ పంట నమోదుతో రైతులకు ఊరట

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈ పంట నమోదుతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీ ఉమా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు వల్ల అతివృష్టి, అనావృష్టితో పంట నష్టపోతే పరిహారం అందుతున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి భారతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతా వివరాలు ఇవ్వండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సప్తగిరి గ్రామీణ బ్యాంకును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చినందున చిత్తూరులోని పెన్షన్‌దారులు తమ ఖాతాల వివరాలు, ఎఫ్ఎస్‌సి కోడ్ వివరాలను అందజేయాలని పెన్షన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

చిరుధాన్యాలతో అధిక లాభం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చిరుధాన్యాలను ఆహారంలో ప్రతినిత్యం ఉపయోగిస్తే ప్రజలకు ఆరోగ్యమని, చిరుధాన్యాల సాగుతో రైతులకు అధిక లాభమని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మునీంద్ర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని నెల్లేపల్లి రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై ఒకరోజు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతూ ప్రస్తుత రైతులు అధిక లాభం సంపాదించవచ్చని, నేటి సమాజంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. అగ్రికల్చర్ ఏవో భవాని, ఆత్మ అధికారి దేవేంద్ర, గ్రామ వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మహాబలిపురం విగ్రహాలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం వేపూరు మిట్టపల్లి గ్రామంలో నూతనంగా పునర్నిర్మిస్తున్న శ్రీరాములవారి ఆలయానికి తమిళనాడు రాష్ట్రం మహాబలిపురం నుండి విగ్రహాలు తీసుకురానున్నారు. ఆలయ గర్భగుడి విగ్రహాల కోసం గ్రామపెద్దలు కన్నప్ప, నీలా వెంకటేష్, మంజునాథ్, బాలకృష్ణ, కనకరాజు, ధనశేఖర్, రఘుపతి, పన్నీర్ మహాబలిపురంలోని శిల్ప కళాప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ రాములవారి ఆలయానికి సంబంధించి విగ్రహాలను కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు.

'కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో కలపాలి'

ప్రజాశక్తి- వెదురుకుప్పం : గంగాధర నెల్లూరు నియోజకవర్గం, కార్వేటినగరం మండలంలో పార్టీలకతీతంగా కార్వేటి నగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో శుక్రవారం ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమంలో కార్వేటి నగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ హామీ ఇచ్చారని, అదేవిధంగా యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను దగ్గరలో ఉన్న తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఈ కార్యాచరణలో ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం భవిష్యత్తు తిరుపతి జిల్లాలోనే బాగా ఉంటుందని విద్యార్థులకు, రైతులకు, వైద్య సదుపాయాలకు అణువుగా ఉందని కనుక ప్రజల అభ్యర్థన మేరకు తిరుపతి జిల్లాలో కార్వేటినగరాన్ని కలపాలని విజ్ఞప్తి చేశారు.

చిరు వ్యాపారులకు ఐడీ కార్డులు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు మంజునాథ్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారులకు గేటు వసూలు ఒకప్పుడు ఇబ్బందిగా మారిందని అయితే ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన విధంగానే అధికారంలోకి వచ్చిన తర్వాత గేటు వసూలను రద్దుచేసి చిరు వ్యాపారులను ఆదుకున్నారని కుప్పం పట్టణ చిరువ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని చిరు వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ వ్యాపారస్తులకు ఐడి కార్డులను, సర్టిఫికెట్లను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ రహిత వ్యాపారం చేయాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బండిలోనే వేయాలని మంజునాథ్ సూచించారు. స్వచ్ఛ కుప్పంకు చిరు వ్యాపారులు సహకరించాలని, ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలని కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మునిరాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యంద్ర శేఖర్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్ ,సోమశేఖర్, రాష్ట్ర నేత గోపీనాథ్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ శివ , వర్ణికుల క్షత్రియ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కడ పీడీ వికాస్ మర్మత్



సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రజలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కడ పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి కుటుంబం బంగారు కుటుంబంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ఐఏఎస్ అధికారి భానుమూర్తి ఆధ్వర్యంలో పి4 అంశాలు అన్నిటిని వివరించి మార్గదర్శకాలతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనతో సుమారు మూడువేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని బ్యాంకు రుణాలు పొందేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలకు నిధులు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే



ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఎం.థామస్ ఐటిఐ కళాశాలకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయని, ఇది రిజర్వేషన్ నియోజకవర్గమని, వెదురుకుప్పం మండలంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నడుస్తుందని, 246 మంది వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కళాశాల నిర్మాణం కోసం స్థలం కేటాయించి, నిధులను కేటాయించి టెండర్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. నిధులు సరిపడా లేకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణ పనులు ఆగిపోయాయని, ఐటీ శాఖ మంత్రి లోకేష్ స్పందించి నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

విజయపురం (నగరి)లో..

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ పథకం ఎంతో దోహదపడుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి టి.మురళి అన్నారు. శుక్రవారం అమ్మరాజుపల్లి పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 144 మందికి రక్త పరీక్షలు, షుగరు, బీపీ, డెంగీ, మలేరియా, జ్వరాలకు పరీక్ష చేసి మందులు అందించారు. అలాగే కేన్సర్‌పై అవగాహన కల్పించారు.

ఐరాల: స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా ఐరాల ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఐరాల ఆసుపత్రిలో మహిళలకు, గర్భవతులకు, బాలింతలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యనిపుణులు డాక్టర్ అనూషక్త, డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు రోగులను పరీక్షించి చికిత్సను అందించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీలు పోషన్ అభియాన్ స్టాల్‌ను నిర్వహించి గర్భవతి, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వాటి విశిష్టతను వివరించారు. సూపర్వైజర్ చిన్నమ్మ, మెయిల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, స్టాఫ్ నర్స్ ప్రసన్న, ల్యాబ్ టెక్నీషియన్ అజారుద్దీన్, ఫార్మసిస్ట్ జయలక్ష్మి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం కత్తెలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆర్కేవిబి పేట గ్రామపంచాయతీలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం డాక్టర్ హేమాశ్రీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం, కేన్సర్ స్క్రీనింగ్, తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్, టిడిపి మండల కార్యదర్శి హేమంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లోకనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కృష్ణచైతన్య ఆలమడుగు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని యూపీఎస్సీ కాకా తోపులో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వరహించారు. మహిళలకు పౌష్టికాహారంపై దృష్టి పెట్టి సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ దేవరాజులు, హెచ్‌డిఎస్ ఛైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : మండలంలోని తడుకుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. సీడీపీవో ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. మహిళలు తీసుకోవలసిన పోషకాహారాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ శిబిరంలో వైస్‌ఎంపీపీ కన్నియప్ప, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సోమల (సదుం): ఐసిడిఎస్ పులిచర్ల ప్రాజెక్టు పరిధిలోని సదుం మండలం కంభం వారి పల్లె గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల సందర్భంగా గర్భవతులు బాలింతలు చిన్నారులకు పోషక విలువల గురించి తెలియజేశారు. సిడిపిఒ వాణిశ్రీదేవి, వైద్యాధికారి చరణ్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు సూచనలు పాటిస్తూ గర్భవతులు బాలింతలు టీకాలు వేసుకోవాలని, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని కోరారు. సూపర్వైజర్ మల్లీశ్వరి, జానకి, శికామణి అంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు.

జగన్న లేఅవుట్‌లో కార్పొరేటర్ భూ ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత ప్రభుత్వంలో జగన్న లేఅవుట్ పేరిట చిత్తూరు నియోజవర్గం బండపల్లిలో 30ఎకరాల్లో లేఅవుట్ వేసి చిత్తూరు నగరంలోని ఇండ్లులేని పేదలకు ఇంటి స్థలాలు మంజురు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోచ్చాక 11వ డివిజన్ కార్పొరేటర్ జయలక్ష్మి భర్త రవి జగన్న లేఅవుట్ స్థలాన్ని ఆక్రమించుకొని మామిడి, కొబ్బరి చెట్లు పెంచేందుకు ప్రయత్నించడంతో శుక్రవారం వైసిపి నాయకులు బండపల్లి లేఅవుట్‌ను పరిశీలించి నిరన వ్యక్తం వ్యక్తం చేశారు. పేదలకు మంజురు చేసిన లేఅవుట్‌ను కాపాడాలంటూ జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులను కోరారు. బండపల్లి 30 ఎకరాల్లో జగన్న లేఅవుట్‌లో 60 మంది పేదలకు ఇండ్ల స్థలాలు మంజురు చేశారని, విద్యుత్ సౌకర్యంతో పాటు, తాగునీటి వసతి కల్పించారని కొందరు ఇంటి నిర్మాణం కోసం పునాదులు కూడా వేశారని తెలిపారు. అయితే రాత్రికి రాత్రే స్థానిక కార్పొరేటర్ భర్త రవి జేసిబితో విద్యుత్ స్థంభాలు, వాటర్ ట్యాంకులు, సర్వే రాళ్ళును తొలగించి ఆక్రమణకు పాల్పడారని, స్థానిక ఎంఎల్‌ఏ అండతోనే రవి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని వైసిపి నేతలు ఆరోపిస్తున్నారు. పేదలకు ఇచ్చిన ఇంటిస్థలాల ఆక్రమణపై జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులు తక్షణం స్పందించి కాపాడాలని కోరారు. లేని పక్షంలో లబ్ధిదారులతో ఆందోళన కార్యక్రమాలను పూనుకోనున్నట్లు తెలిపారు.

జేసిబితో తొలగించిన సర్వే రాళ్ళు, విద్యుత్ స్థంభాలు

తమిళ శాఖ పరిశోధక విద్యార్థి

ఎం.సెంతమరైకి డాక్టరేట్

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం తమిళ భాష, అనువాద అధ్యయనశాఖలో పరిశోధనలు చేసిన ఎం.సెంతమరైకి డాక్టరేట్ లభించింది. 20వ శతాబ్దపు తోల్కప్పియం గ్రంథాల పాఠ్య నాణ్యత అనే అంశంపై డాక్టర్ జి.మరియప్పన్ పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేయడంతో ఆమెకు డాక్టరేట్ లభించిందని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈమె తమిళ అనువాదకుడు, భారతీయ భాషా సమితి, విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటనలో రూ.10 లక్షల ఆస్తినష్టం చోటు చేసుకున్న సంఘటన శుక్రవారం మండల కేంద్రంలోని 170 గొల్లపల్లిలో చోటు చేసుకుంది. నాగరాజ్ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేకుంది దీంతో ఇంట్లో మంటలు చెలరేగాయి, ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అగ్ని మాపక వాహనం వచ్చే లోపే ఇల్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ10 ఆస్తినష్టం జరిగిన్నట్లు బాధితుడు నాగరాజు తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిలో ఓ కారుకు కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడ్డ సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం హెూసూరు నుండి పుత్తూరుకు కారులో వెళుతున్న రమేష్ కుటుంబ సభ్యులు ఎట్టేరి ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో కుక్క అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పిన కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులకు చిన్నచిన్న గాయాలు కాగా స్థానికులు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తహశీల్దార్ అండతో భూ ఆక్రమణ

మీడియాను ఆశ్రయించిన బాధితురాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ అనుభవంలో ఉన్న 2 ఎకరాల భూమిని మురార్జీ అనే భూస్వామి ఆక్రమిస్తున్నారని యాదమరి మండలం రసూల్ నగర్ ఏఏడబ్ల్యూ కాలనీకి చెందిన బుజ్జి ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాదమరి తహశీల్దార్ అండతో అక్రమార్కులు తప్పుడు రికార్డులు సృష్టించి తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిలోని టేకు చెట్లు, మామిడి చెట్లను తొలగించారని, ప్రశ్నించిన తమను కులం పేరుతో దూషించారని కన్నీళ్ల పర్యంతమయ్యారు. తమ కుటుంబానికి ఉన్నది ఈ రెండెకరాలు మాత్రమే అని, ఈ భూమిని కోల్పోతే తమ వద్దకు రోడ్డున పడుతుందని వాపోయారు. తమ బతకను రోడ్డు పాలు చేస్తున్న మురార్జీపై చర్యలు తీసుకొని తమ భూమిని కాపాడాలని కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు బుజ్జి

ఎంఎల్ఏ పై అసత్య ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అన్యాయం జరిగితే ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేయాలే తప్పా ఎంఎల్ఏ పై అసత్య ప్రచారం మానుకోవాలని తెలుగు మహిళా నాయకులు లీలావతి తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా వైసిపి నాయకులు తెలుగుదేశం నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజంగా అన్యాయం జరిగితే తెలుగుదేశం నాయకుడిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అసలు ఏం జరిగిందో విచారించకుండా ఎంఎల్ఏ ప్రోత్సహం ఉన్నట్లు చెప్పడం సరికాదన్నారు. పేదలకు అన్యాయం జరిగితే తెలుగుదేశం పార్టీ చూస్తూ ఊరుకోదని నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు నళిని తిరుకుమార్ తెలిపారు.

నేడు సదుంకు సజ్జల రామకృష్ణారెడ్డి రాక

ప్రజాశక్తి- సోమల: పుంగనూరు నియోజకవర్గం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు శనివారం ఉదయం 9.30 గంటలకు సదుం మండలం ఎర్రతివారిపల్లె భజన మందిరంలో జరగనున్న సమావేశానికి వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారని మండలాల వైసిపి అధ్యక్షులు గంగాధర రాయల్, రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు ద్వారకనాథ్ రెడ్డి, చిత్తూరు తిరుపతి అన్నమయ్య జిల్లాల నుండి వైసిపి నాయకులు కార్యకర్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. కనుక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ద్రావిడలో దసరా మహోత్సవాలు

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విద్యాలయంలోని శుక్రవారం దసరా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. దసరా నవరాత్రులు సందర్భంగా వర్శిటీలోని ప్రధాన గ్రంథాలయంలో నెలకొల్పిన సరస్వతి అమ్మవారి పూజా కార్యక్రమంను ఘనంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, ఆచార్య కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య శ్యామల, ఆచార్య శ్రీనివాస్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీ బంగారమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని అన్నపూర్ణ దేవి అలంకరణలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శించుకున్నారు. ఉభయ దారులగా ఎం.ధనంజయ వర్మ, ఎం.ముని రామరాజులు వ్యవహరించారు. ఆలయ అధ్యక్షులు కె.ప్రసాద్ భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

సోమల: సోమల మండలం ఆవులపల్లి పంచాయతీ పత్రపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ దండుకొండ గంగమ్మ వారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్నపూర్ణాదేవి అలంకరణ బలిజ కమ్మ నాయుళ్ళ జంగమ సంఘం వారిచే నిర్వహించారు.

రామకుప్పం: శరవన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో మహాలక్ష్మి అవతారం, ఆనిగనూరు గ్రామంలో పత్తి అలంకారంతో కన్యకా పరమేశ్వరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. సాయంత్రం పంచామృత అభిషేకాలు, దీపారాధన, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి దర్శన ఏర్పాటు చేశారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లియల్లమ్మ తల్లీ దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు మీనాక్షి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా వెజ్జుపల్లి పెద్దబ్బరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించగా, గంగాధర నెల్లూరు ఎగవూరుకు చెందిన సుబ్బారెడ్డి సన్స్, రాజారెడ్డి, లక్ష్మణ రెడ్డి కుటుంబ సభ్యులు సుమారు 400 మందికి అన్నదానం నిర్వహించారు.